ఇంటికే సరకులు.. తప్పిన కష్టాలు

- ఇంటింటికీ రేషన్ పథకానికి ఐదేళ్లు
- సేవ, ఉపాధి మిళితమైన కార్యాచరణ
- రెండు నియోజకవర్గాల్లో 119 ఎండీయూలు
- కూటమి పాలనలో నిర్వీర్యానికి ప్రయత్నం



పడమర ఖండ్రికలో ఎండీయూ వాహనం ద్వారా ఇంటి వద్ద బియ్యం పంపిణీ చేస్తున్న సిబ్బంది

కపిలేశ్వరపురం: పేదల పక్షమంటే ప్రతిక్షణం వారి బాగోగులు కోసమే ఆలోచన ఉండాలి. సాధ్యాసాధ్యాల సంగతి పక్కనబెట్టి సామాన్యుల కోసం పథకాలను రూపొందించాలి. మాటలకే పరిమితం కాకుండా చేతల్లో సైతం ప్రతి పేదవాడి గుండెను తాకాలి. అడపాదడపా అమలు కాకుండా ఎన్నేళ్లైనా అమలు చేస్తూ ఉండాలి. అదే జరిగింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనాకాలంలో.. అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు దేశానికే ఆదర్శమయ్యాయి. అలాంటి పథకాల్లో ఇంటింటికీ రేషన్ సరకుల సరఫరా పథకం ఒకటి. నవరత్నాలు పేరుతో రూపొందించిన ప్రజా పథకాలను నాలుగున్నరేళ్ల విజయవంతంగా అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తుంది. పథకానికి ఐదేళ్లు నిండిన సందర్భంగా ఈ కథనం...

పథకం నేపథ్యమిదీ...

రాష్ట్రంలో 2021 జనవరి 21న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. వాహనాలన్నీ క్షేత్ర స్థాయికి చేరుకోగానే ఫిబ్రవరి ఒకటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 12 పట్టణాల్లో ప్రారంభమైంది. పంచాయతీ ఎన్నికల కోడ్ కారణంగా ఆలస్యంగా 23న గ్రామాల్లో ప్రారంభమైంది. ఐదేళ్లుగా పేదలకు సరకుల పంపిణీ దిగ్విజయంగా కొనసాగుతుంది.

రెండు నియోజకవర్గాల్లో ప్రయోజనం ఇలా...

మండపేట నియోజకవర్గంలో 147 షాపుల పరిధిలో 65 ఎండీయూ వాహనాల ద్వారా 85,894 కుటుంబాలకు సరకులను పంపిణీ చేస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో 146 షాపుల పరిధిలో 54 వాహనాల ద్వారా 77,843 కుటుంబాలకు ఇంటింటికీ రేషన్ సరఫరా చేస్తున్నారు.

మండలం	షాపులు	వాహనాలు	కార్డులు
మండపేట	64	34	43,029
రాయవరం	41	13	21,059
కపిలేశ్వరపురం	42	18	21,806
రామచంద్రపురం	58	24	34,420
కె.గంగవరం	43	15	20,602
కాజులూరు	45	15	22,821
మొత్తం	293	119	1,63,737

ప్రభుత్వం మారినా అమలు చేయక తప్పని పరిస్థితి

కారణాలేమైనా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. వచ్చీ రాగానే ప్రజా సంక్షేమ పథకాలు భారమైనవంటూ సన్నాయినొక్కులు నొక్కనారంభించింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనాకాలంలో ప్రవేశపెట్టిన పథకాలు ప్రజల్లో బలంగా నాటుకుపోయాయి. వాటి జోలికొస్తే ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమయ్యే పరిస్థితులున్నాయి. అందువల్ల కూటమి పాలకులు చేసేదిలేక పలు పథకాలను పేర్లు మార్చుకుని అమలు చేస్తున్నారు. అయినప్పటికీ పథకాలను నిర్వీర్యం చేసే పనిని కూటమి ప్రజాప్రతినిధులు మానుకోవడంలేదు. స్వయంగా పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణితో ప్రభుత్వానికి కోట్లాది రూపాయిలు భారమవుతుందంటూ ప్రకటనలు చేశారు. పథకానికి స్వస్తి పలకనున్నట్టు బాధ్యతను మరచి మరీ పలుమార్లు ప్రకటనలు చేశారు. వాస్తవానికి ఎండీయూ ఆపరేటర్లకు 2027 వరకూ నిర్వహణాపరమైన గడువు ఉంది. అయినప్పటికీ వారి ఉపాధి మార్గాన్ని కూటమి ప్రభుత్వం ధ్వంసం చేసేందుకు ప్రయత్నం చేస్తుంది. పేదల కోసం ప్రవేశపెట్టిన ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీ పథకానికి పేద ప్రజలంతా జై కొడుతున్నారు.

క్లుప్తంగా

ఘనంగా వేణుగోపాలస్వామి గరుడ వాహనసేవ



వేణుగోపాలస్వామి గరుడ వాహనసేవ

రాయవరం: సోమేశ్వరం గ్రామంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదో రోజు బుధవారం గరుడవాహన సేవ ఘనంగా నిర్వహించారు. మాఘమాసంలో జరిగే వార్షిక కల్యాణోత్సవాల్లో భాగంగా ఆలయ అర్చకులు పెద్దింటి శేషాచార్యులు ఆధ్వర్యంలో వేణుగోపాలస్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు. మాఘ పౌర్ణమి సందర్భంగా వేణుగోపాలస్వామికి, అమ్మవార్లకు తులసిదళ అర్చనలు, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గరుడ వాహన సేవను భక్తులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో గంథం సత్యనారాయణ, దేవస్థానం సిబ్బంది పెమ్మాడి వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

300 మందికి కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యబృందం

మండపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్ సారథ్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కాకినాడలోని కిరణ్ కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో కంటి రోగులకు సేవలు అందించారు. మారేడుబాక, పట్టణ ప్రజలు వెళ్లి కంటి పరీక్షలు చేయించుకున్నారు. 300 మంది సేవలు పొందారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ వివరించారు. అలాగే బీపీ, షుగర్ పరీక్షలు కూడా చేశారు. పరీక్షల అనంతరం ఆపరేషన్ అవసరమైన వారికి కాకినాడకు రిఫర్ చేశామని తెలిపారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ పి.వెంకన్న, అధ్యాపకులు డాక్టర్ కే ఎస్ఆర్ నాయక్, శంకర్, గోపాలకృష్ణ, డాక్టర్ మధు, రామకృష్ణ, అభినయ్, వైద్యులు పాల్గొన్నారు.

ఘనంగా మాఘ పౌర్ణమి పూజలు

రాయవరం: వెదురుపాక విజయదుర్గా పీఠంలో మాఘ పౌర్ణమిపూజలు బుధవారం ఘనంగా నిర్వహించారు. విజయదుర్గా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. తొలుతగా విజయ వేంకటేశ్వరస్వామికి సుప్రభాతసేవ, తులసి దళ అర్చనలు చేశారు. అనంతరం విజయ దుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు. భవాని శంకరసమేత అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి గాడ్ భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ మాఘ పౌర్ణమి విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిపారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే బాస్కరనారాయణ, సత్య వెంకట కామేశ్వరి. బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ




మాణిక్యాంబా అమ్మవారికి సారె తెస్తున్న మహిళలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా అమ్మవారికి భీమేశ్వరాలయంలో నిత్యం పారాయణల్లో పాల్గొనే మహిళా భక్తులు సారె తీసుకువచ్చారు. స్వామి వారి కల్యాణ రథం వేగాయమ్మపేట నుంచి వచ్చే క్రమంలో రథంతో పాటు అమ్మవారికి సారె తెచ్చి సమర్పించారు.

బాధితులకు సీఎం సహాయనిధి అందజేత

మండపేట: అనారోగ్యంతో ఆసుపత్రులలో చికిత్స పొంది ఆర్థిక సహకారం అందించాలని దరఖాస్తు చేసుకున్న 20 మంది బాధితులకు సీఎం సహాయనిధి ద్వారా రూ.18.60 లక్షల మంజూరయ్యాయి. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు మంజూరైన చెక్కులను బాధితులకు అందించారు.

శుభశ్రీవల్లికి అభినందనలు



కపిలేశ్వరపురం: అంగర గ్రామానికి చెందిన యానాల శుభ శ్రీవల్లీఆత్రేయి మంగళవారం విడుదల చేసిన జేఈఈ మెయిన్స్‌లో మెరుగైన ప్రతిభ కనబరచింది. కాకినాడలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదువుతున్న ఆత్రేయి 99.96 స్కోర్‌తో నిలిచింది. చిన్నారి తండ్రి సాయికృష్ణ ఎస్‌బీఐలో చీఫ్ అసోసియేట్‌గానూ, తల్లి అచ్చియ్యమ్మ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయినిగానూ పని చేస్తున్నారు.

స్వచ్ఛ మండపేట సాధనే లక్ష్యం

- ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి
- ప్రజలంతా సహకరించాలి
- వార్డుల్లో ప్రచారానికి ఆర్పీలకు కమిషనర్ దిశా నిర్దేశం



ఆర్పీలకు స్వచ్ఛ మండపేట లక్ష్యాలను వివరిస్తున్న కమిషనర్ రంగారావు

మండపేట: స్వచ్ఛ మండపేట సాధనే లక్ష్యంగా పురపాలక సంఘం ముందుకు వెళ్తోందని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. ప్రజలకు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో శుభ్రత, పరిశుభ్రత, ప్లాస్టిక్ నిర్మూలన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని పేర్కొన్నారు. ఇందుకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఆయన కోరారు. వార్డుల్లో ప్రచారం నిమిత్తం బుధవారం మున్సిపల్ కార్యాలయంలో మెప్మా ఆర్పీలకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఇంటింటా ప్రచారం నిర్వహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరూ పట్టణాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్దడానికి తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ క్రమంలో ఆయన ఆర్పీలను వెంటబెట్టుకుని వార్డుల్లో పర్యటించారు. ఇంటింటికీ కలియతిరుగుతూ ప్లాస్టిక్ నిషేధం, తడి, పొడి చెత్త వేరుచేసే విధానంపై తెలియజేశారు. పొడి చెత్తను కార్మికులకు అందించి తడి చెత్తను హోం కంపోస్టుగా ఎలా మార్చాలనే అనే దానిపై ఆర్పీల ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ రంగారావు మాట్లాడుతూ స్వచ్ఛ మండపేట సాధనలో భాగంగా ముఖ్యంగా ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వినియోగం రోజురోజుకు పెరిగిపోతున్న నేపథ్యంలో వాటివల్ల వచ్చే అనర్థాలను ప్రజలంతా తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిత్యం ప్రతిఒక్కరూ మార్కెట్లో ఏదో ఒక వస్తువు తప్పని సరిగా కొనుగోలు చేయడం పరిపాటేనన్నారు. ఆ సమయంలో వస్తువులు మోయడానికి ప్లాస్టిక్ బదులు గన్నీ బ్యాగ్స్, గుడ్డ బ్యాగులు వాడడం అలవర్చుకోవాలన్నారు. వ్యాపార సంస్థల వద్ద ఎట్టి పరిస్థితుల్లో ప్లాస్టిక్ కవర్లు ఇవ్వడానికి, అమ్మడానికి వీల్లేదన్నారు. పట్టణ ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీఈఈ కే శ్రీనివాస్, ఏఈలు పవన్‌కుమార్, ఆంజనేయులు, మెప్మా సీఎంఎం పెండ్యాల సుజాత, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు, ఆరోగ్య సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

ప్రారంభ దశలోనే కుష్ఠు వ్యాధిని గుర్తించాలి



వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేస్తున్న పాదరక్షలు

కె.గంగవరం: ప్రారంభ దశలోనే కుష్ఠు వ్యాధిని గుర్తిస్తే అంగవైకల్యం రాకుండా ఉంటుందని జిల్లా డిప్యూటీ పారా మెడికల్ అధికారి మాధవరపు వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని దంగేరు పీహెచ్‌సీ వద్ద బుధవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి 13వ తేదీ వరకు స్పర్శ ప్రోగ్రాంలో భాగంగా ఆశా కార్యకర్తలందరూ ఇంటింటికీ వెళ్లి కుష్ఠు వ్యాధిపై అవగాహన కల్పించి ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి అంగవైకల్యం రాకుండా చూడాలన్నారు. గత నెల 20 నుంచి ప్రారంభమైన ఎల్సీడీసీ కార్యక్రమంలో ఈ నెల 13వ తేదీ వరకు పొడిగించారని ఈ కార్యక్రమంలో కొత్తగా జిల్లాలో 14 కొత్త కేసులు గుర్తించి చికిత్స చేస్తారన్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి జనవరి వరకు 77 కొత్త కేసులు గుర్తించి చికిత్స అందించామన్నారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యులు ఆమని చేతుల మీదుగా కుష్ఠువ్యాధి గ్రస్తులకు మైక్రో సెల్యులర్ రబ్బర్‌తో ప్రత్యేకంగా తయారు చేసిన పాదరక్షలు, అల్సర్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ పద్మేష్‌బాబు, నోడల్ పర్సన్ శ్రీమన్నారాయణ, జిల్లా నోడల్ అధికారి సీహెచ్ సూర్యారావు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆయకట్టు చివరి వరకూ సాగునీరు అందిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న డీసీ చైర్మన్లు

కె.గంగవరం: పల్లపు ప్రాంతాల్లోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని సాగునీటి సంఘం డీసీ చైర్మన్లు మెర్ల గోపాలస్వామి, మేకా శివప్రసాద్, దాట్ల విజయగోపాలరాజు, వి.భాస్కరరాజు, ఎన్‌వీవీవీ సుబ్రహ్మణ్యం చౌదరి అన్నారు. కోటిపల్లిలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద బుధవారం ఆలమూరు, కూళ్ల, కోటిపల్లి, తాళ్లరేవు, యర్రపోతవరానికి చెందిన డీసీ చైర్మన్లు, నీటి సంఘం అధ్యక్షులు సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సాగునీటి సంఘం అధ్యక్షులు, డీసీ చైర్మన్లు సమన్వయంతో పని చేయాలని కోరారు. కాలువలను ఆధునీకరించడానికి చర్యలు చేపడుతున్నామని దానికి సంబంధించిన సూచనలు, సలహాలు అందించాలని కోరారు. పంట కాలువలకు ఆక్రమణలకు గురి కాకుండా చూడాలని నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న వ్యర్థాలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆలమూరు సెక్షన్, కోటిపల్లి సెక్షన్, తాళ్లరేవు సెక్షన్ అధికారులు, నీటి సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

పట్టణ బీజేపీ అధ్యక్షుడిగా శ్రీనివాసు



నూతనంగా నియమితులైన బీజేపీ పట్టణ కార్యవర్గం

రామచంద్రపురం: పట్టణ భారతీయ జనతా పార్టీ (బీజేపీ) అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన దూనే శ్రీనివాసు నియమితులయ్యారు. ఆయన ఆధ్వర్యంలో పార్టీనాయకులు కేశవ రాఘవేంద్రరావు స్వగృహంలో బుధవారం సమావేశం నిర్వహించి నూతన పట్టణ కమిటీని ప్రకటించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి వెంకటేశ్వరరావు (బాబి మాస్టర్) అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నూతన కమిటీ అధ్యక్షులుగా దునే శ్రీనివాసు, ఉపాధ్యక్షులుగా కులపాకల వెంకటరమణ, ఉండవిల్లి సత్యనారాయణ, చొల్లంగి రాంబాబు, వడ్డాది నాగార్జున, కొనపాల గణేష్, అనుపోజు సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శులుగా మాధవభట్ల కృష్ణమూర్తి, కొప్పిశెట్టి శ్రీను, కార్యదర్శులుగా అంకం ధనరాజు, ఫిలుకనా లక్ష్మీభార్గవి, కొనపాల రేవతి, అనంతలక్ష్మి, రాజ్యలలక్ష్మి కె.ఆదిత్య, కోశాధికారి గుండుబోగుల ప్రసాద్‌లు నియమితులయ్యారు. కార్యక్రమంలో రామచంద్రాపురం అసెంబ్లీ కో కన్వీనర్ సలాది శేఖర్, పార్టీ సీనియర్ నాయకులు కొట్టువాడ హరిబాబు, యండ్ర బుల్లబ్బులు, సలాది సతీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ



విద్యార్థులకు మొక్కలు అందించిన పవర్‌గ్రిడ్ జనరల్ మేనేజర్ నాగమోహనరావు

కె.గంగవరం: మొక్కలు పెంచడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడంతో పాటు ఆరోగ్యాన్ని కూడా ఇస్తాయని విజయవాడ పవర్‌గ్రిడ్ జనరల్ మేనేజర్ కుడుపూడి నాగమోహనరావు అన్నారు. మండలంలోని కె.గంగవరం ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన జన్మభూమిపై ఉన్న మమకారంతో విలువైన పండ్ల, ఔషధ జాతి మొక్కలను విద్యార్థులతో కలసి నాటించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పండ్ల జాతి మొక్కలను పెంచడం వల్ల భావి విద్యార్థులకు వాటి పండ్లు ఎంతో ఆరోగ్యాన్ని చేకూరుస్తామని సూచించారు. ఆయన తండ్రి నరసన్న లైన్‌మన్‌గా కె.గంగవరం, పామర్రు తదితర ప్రాంతాల్లో పనిచేశారని తద్వారా ఆయా ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు చేపడుతున్నానన్నారు. త్వరలోనే ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేస్తానని చెప్పారు. సుమారు రూ.25 వేలు విలువ చేసే నేరేడు, సపోటా, మారేడు, జామ, నిమ్మ, మామిడి, సీతాఫలం, కొబ్బరి వంటి మొక్కలను విద్యార్థులకు అందించి వారితో పాఠశాల ఆవరణలో నాటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బండి మృత్యుంజయరావు, స్వచ్ఛభారత్ సమన్వయకర్త చిల్లి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ప్రక్కి బ్రహ్మానందం, పితాని శ్రీనివాసు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



తైక్వాండో పోటీలను ప్రారంభించిన చైర్‌పర్సన్ శ్రీదేవి, సత్యం తదితరులు

రామచంద్రపురం: క్రీడలు విద్యార్థుల్లో మానసిక, శారీరక దారుఢ్యాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, కూటమి సీనియర్ నేత వాసంశెట్టి సత్యం, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ తదితరులు అన్నారు. పట్టణంలో ఎస్ఆర్‌కె జానకీదేవి తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన 16వ జిల్లా స్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలను బుధవారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో క్రీడాకారుల ఉద్దేశించి వారు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ఒత్తిడి లేని చదువు, మానసిక ప్రశాంతత కోసం విద్యార్థులకు క్రీడలు తప్పనిసరి అన్నారు. క్రీడల్లో రాణించడం ద్వారా అనేక రాయితీలు, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యం దక్కుతుందన్నారు. విద్యార్థులకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అంతర్జాతీయ ఇన్‌స్ట్రక్టర్ ప్రసాద్ రాయల్ మాట్లాడుతూ ఈ జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో యానం, కాకినాడ, అనపర్తి, రామచంద్రపురం, రాయవరం, మండపేట, రావులపాలెం తదితర ప్రాంతాల నుంచి 180 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులతో పాటు, సర్టిఫికెట్లు ప్రదానం చేస్తామన్నారు.

వరుస దొంగతనాలతో బేజారు



ఎంపీయూపీ స్కూల్‌లో కటకటాల మధ్య చిక్కుకోవడంతో ఐఎఫ్‌పీని వదిలివెళ్లిన దొంగలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్ల పాలెం ఎంపీయూపీ స్కూల్లో వరుస దొంగతనాలతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు బేజారవుతున్నారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ సంఘటనలకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది డిసెంబరు 24, 25 తేదీల్లో పాఠశాలలకు సెలవులు రావడంతో 26న పాఠశాలకు వచ్చిన సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటకు ఉపయోగించే రెండు గ్యాస్ సిలిండర్లు చోరీకి గురవ్వడం గురించి ద్రాక్షారామ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఈ నెల 8, 9 తేదీల్లో వరుస సెలవులు రావడం 10న పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు గత వైఎస్సార్ ప్రభుత్వంలో విద్యార్థులకు డిజిటల్ విద్యను అందించడానికి అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు అందించిన సుమారు రూ.లక్షకు పైగా ఖరీదు ఉండే ఇన్‌ట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానల్(ఐఎఫ్‌పీ)ని దొంగిలించడానికి ప్రయత్నం చేసి వీలు కాకపోవడంతో వదిలి వెళ్లిన దృశ్యాన్ని చూసి అవాక్కయ్యారు. అయితే ఈ ప్యానల్‌తో కలిపి ఉండే బైజూస్ కనెక్ట్ బాక్స్ దొంగతనానికి గురయినట్లు గుర్తించారు. ఈ సంఘటనపైనా పోలీస్ కంప్లెయింట్ ఇచ్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బొలిశెట్టి లక్ష్మణరావు తెలిపారు. దీనిపై ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ వివరణ కోరగా సంఘటనపై ఇంకా కేసు నమోదు చేయలేదని విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ల సీజ్



కొత్తపేట పోలీస్ స్టేషన్‌లో ఇసుక లోడు ట్రాక్టర్లు

సాక్షి ఇంపాక్ట్

కపిలేశ్వరపురం: మండలంలోని ఇసుక ర్యాంపుల నుంచి కూటమి ప్రభుత్వ నేతల అండదండలతో అడ్డూ అదుపు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. రాత్రింబవళ్లు నిబంధనలకు విరుద్ధంగా భారీ వాహనాల్లోనూ, ట్రాక్టర్లలోనూ ఇసుకను విక్రయిస్తున్నారు. తాతపూడి కేదారిలంక, కపిలేశ్వరపురం ర్యాంపులలో జరుగుతున్న అక్రమాలను మంగళవారం సాక్షిలో 'ఇసుక తరలింపునకు అక్రమ బాట' శీర్షికన కథనాన్ని ప్రచురించింది. అక్రమాలు జరుగుతున్న తీరుతోపాటు కేదారిలంక ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు జనవరి 27న జిల్లా కలెక్టరేట్‌లో చేసిన ఫిర్యాదుకు అధికారులు ఏమాత్రం స్పందించని వైనాన్ని సాక్షి కథనంలో వివరించింది. ఇదిలా ఉండగా మైన్స్ అధికారులు బుధవారం కేదారిలంక ఇసుక ర్యాంపును తనిఖీ చేశారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 8 ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని కొత్తపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కూటమి ప్రభుత్వంలో ర్యాంపుల నుంచి ఇసుకను అక్రమంగా దోచుకుంటున్నారన్న విషయం ట్రాక్టర్లను సీజ్ చేయడాన్ని బట్టి స్పష్టమైంది.

మహా కుంభమేళాకు రెండు ఆర్టీసీ బస్సులు



మహా కుంభమేళాకు రామచంద్రపురం నుంచి బయలుదేరిన ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి మహాకుంభ మేళా-అయోధ్యలకు రెండు ప్రత్యేక సర్వీసులను రామచంద్రపురం ఆర్టీసీ డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ రెండు బస్సుల్లోని భక్తులు 8 రోజుల పాటు భువనేశ్వర్, కోణార్క్, ప్రయాగరాజ్, వారణాసి, అయోధ్య, గయ, బుద్ధగయ, అరసవిల్లి, శ్రీ కూర్మం, త్రివేణి సంగమ స్నానం, విశ్వనాథదర్శనం, గయ పిండ ప్రదాన ప్రాంతాలను సందర్శించడం జరుగుతుందన్నారు. ప్రయాగరాజ్, కాశీ క్షేత్రాల్లో ఒక రోజు బస చేయడం జరుగుతుందన్నారు. ఈ బస్సుల్లో ప్రయాణించే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్, గ్యారేజీ ఇన్‌చార్జ్ జి.రవిబాబు, డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది, మహా కుంభమేళా యాత్రికులు పాల్గొన్నారు.

అమృతహాసినికి సత్కారం



అమృత హాసినిని అభినందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలేనికి చెందిన కిక్ బాక్సర్ కేశన అమ్మృతహాసిని ఈ నెల ఒకటి నుంచి 5 వరకు న్యూఢిల్లీ కేడీ జాదవ్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఫోర్త్ వ్యాకో ఇండియా ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ టోర్నీలో ప్రతిభ కనబరచి లైట్ కాంటాక్ట్, కిక్ లైట్ విభాగాల్లో రెండు సిల్వర్ మెడల్స్ సాధించింది. ఈ మేరకు బుధవారం వెంకటాయపాలెంలోని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఇంటి వద్ద ప్రత్యేకంగా అభినందించి దుశ్శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్సీ త్రిమూర్తులు మాట్లాడుతూ ఆత్మరక్షణ విద్యల్లో బాలికలు ఉత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయం అన్నారు. బాలికను ప్రోత్సహిస్తున్న తల్లి ఆరిగెల మాణిక్యాంబికాదేవిని అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు యల్లమిల్లి సతీష్ కుమారి, వైస్ ఎంపీపీ శాకా చంద్రశేఖరసూర్యప్రకాశ్(బాబీ), పెద్దలు తోట శ్రీను, బోనం శ్రీనివాస్, అరిగెల భీమశంకరరావు(దొరబాబు) పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

కాజులూరు: గొల్లపాలెం 33/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప మండలాల్లోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ కాకినాడ ఈఈ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. బుధవారం గొల్లపాలెం మెయిన్ సబ్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్ల మరమ్మతులు, ట్రీ కటింగ్ పనుల్లో భాగంగా ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయవలసి వస్తుందన్నారు. గొల్లపాలెం 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని కాజులూరు మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, మొగలిపాలెం, బందనపూడి, శలపాక, మంజేరు, టి.మామిడాడ, పెనుమళ్ళ, అండ్రంగి, జగన్నాథగిరి, కరప మండలంలోని కొంగోడు, పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం, యండమూరు, గొర్రిపూడి, కాజులూరు 11 కేవీ ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని అయితపూడి, శీల, ఒంటితాడి, తిప్పరాజుపాలెం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు. పై గ్రామాల్లో గృహావాసాలతో పాటు విద్యుత్‌లైన్లలోని ఇండస్ట్రియల్, ఆక్వా చెరువులకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలన్నారు.